సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 2 । మే । 2023



సవాళ్లను స్వీకరిస్తేనే..

సవాళ్లను స్వీకరించిన వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 8లో



వెలవెలబోయిన ఐటీడీఏ స్పందన

ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సోమవారం కురిసిన భారీ వర్షానికి రంపచోడవరం ఐటీడీఏ స్పందన వెలవెలబోయింది. 8లో



కల్యాణం.. కమనీయం

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సమాచార శాఖ అధికారులు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ (2023–24)ను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలుజేసే అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలన్ని ఈ క్యాలెండర్‌లో పొందుపర్చడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు క్యాలెండర్లు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ జిల్లా అధికారి పి.గోవిందరాజులు, డివిజన్ అధికారి పి.రాములు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 3న జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధురవాడ హిల్ నెం 4 పై అదానీ డేటాసెంటర్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఎల్‌ఈడీ స్క్రీన్స్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎన్‌ఈసీ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ముగిసేంత వరకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సికెల్‌సెల్ ఎనీమియా ల్యాబ్ పరిశీలన


- వైద్య సేవలపై వరల్డ్ బ్యాంక్ ఆఫీసర్ అమిత్ నాగరాజు ఆరా



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్టు ఆపరేషన్ ఆఫీసర్ అమిత్ నాగరాజు

పాడేరు రూరల్: పాడేరు జిల్లా ఆస్పత్రిలో సికెల్‌సెల్ ఎనీమియా ల్యాబ్‌ను టాస్క్ టీం లీడర్ ఫర్ వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్టు ఆపరేషన్ ఆఫీసర్ అమిత్ నాగరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్ బాషా సోమవారం సందర్శించారు. ఆస్పత్రిలో ఎస్‌ఎన్‌సీయూ, గైనిక్ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధిపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఆస్పత్రిలో డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి మందుల నిల్వలపై ఆరా తీశారు. వైద్య చికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. కృష్ణారావు, డీసీహెచ్ డాక్టర్ శంకర్ ప్రసాద్, పాల్గొన్నారు.

పిట్టలాబుర్ర జలపాతానికి పర్యాటకుల తాకిడి



ముంచంగిపుట్టు: దివి నుంచి భువికి జాలువారుతూ.. తెల్లటి పాల వలే నీటి ప్రవాహంతో పరుగులు పెడుతూ.. పర్యాటకులను పిట్టలాబుర్ర జలపాతం మంత్రముగ్ధులను చేస్తోంది. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల సరిహద్దులో ఉన్న ఈ జలపాతానికి నెల రోజులుగా పర్యాటకుల తాకిడి నెలకొంది. కొన్ని సంవత్సరాలుగా ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని గ్రామాల నుంచి మాత్రమే గిరిజనులు వచ్చి ఈ జలపాతాన్ని వీక్షించేవారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా ఈ జలపాతం సమాచారం వ్యాప్తి చెందడంతో ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, జైపూర్ వంటి ముఖ్య పట్టణాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందర్శిస్తున్నారు.

దంచికొట్టిన వాన

జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం దంచికొట్టింది. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వేకువజామున మొదలై మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. పలుచోట్ల పంటలు తడిచిముద్దయ్యాయి. జనజీవనం స్తంభించింది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో కలవరం నెలకొంది. మొత్తంగా 182.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



డుంబ్రిగుడ పడుతున్న భారీ వర్షం

- జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం
- ఉదయం నుంచి స్తంభించిన జనజీవనం
- 182.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



దేవీపట్నం: ఇందుకూరుపేటలో తడిసిన మొక్కజొన్న పొత్తులు



రాజవొమ్మంగి వద్ద బురదలో కూరుకుపోయిన కారును బయటకు తీస్తున్న ప్రయాణికులు



వై.రామవరంలో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జోరువాన కురిసింది. సోమవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పడింది. దాంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి వరుణుడు శాంతించడంతో వర్షం తగ్గింది. పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ప్రజలను భయపెట్టింది.

జిల్లాలో వర్షపాతం వివరాలు..

జిల్లా వ్యాప్తంగా 182.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది దేవిపట్నం 45.3, రాజవొమ్మంగి 28.6, ఏటపాక 17.5, కూనవరం 12.5, చింతూరు 8, వి.ఆర్.పురం 16.3, ముంచంగిపుట్టు 2, పెదబయలు 1.8, డుంబ్రిగుడ 3.3, అరకులోయ 12.2, పాడేరు 1.5, చింతపల్లి 1.6, జి.కే.వీధి 4.5, కొయ్యూరు 1.5, మారేడుమిల్లి 9.8, వై.రామవరం 2.7, అడ్డతీగల 11.5, గంగవరం 1.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

హైవేపై చేరిన బురదతో ఇక్కట్లు..

రాజవొమ్మంగి: మండలంలో దాదాపు నాలుగు గంటల పాటు కురిసిన వానకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తంటికొండ– దూసరపాము గ్రామాల మధ్య నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారి బురదమయంగా మారింది. దీంతో ఆర్టీసీ బస్సులు సహా పలు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏలేశ్వరం, రంపచోడవరం, అడ్డతీగల, నర్సీపట్నం, పాడేరు వెళ్లాల్సిన బస్సులు గంటకొద్దీ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇక్కడ బురదలో కూరుకుపోయిన వాహనాలను బయటకు తీసేందుకు స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఓ ఆర్టీసీ బస్సు రోడ్డు దిగువకు ఒరిగిపోయింది. దీంతో ప్రయాణికులను కిందికి దించి బస్సును అతి ప్రయాసతో రోడ్డుపైకి తెచ్చారు. ఈ వర్షంతో వేసవి తాపం నుంచి గిరిజనులు ఉపశమనం పొందారు.

తడిసిన రబీ పంటలు

దేవీపట్నం: ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా అకాల వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి రబీ సీజన్‌లో ఇందుకూరుపేట, ఇందుకూరు, పోతుకొండ, దేవారం తదితర గ్రామాల్లో సాగుచేసిన మొక్కజొన్న కళ్లాలు తడిసిముద్దయ్యాయి. కళ్లాలో ఆరబెట్టిన ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకుని కాపాడుకున్నారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయిని వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అసలే తడిసిన మొక్కజొన్న కళ్లాలు ఆరకుండా మరోసారి వర్షం బారిన పడితే గింజలు మొలకెత్తి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డుంబ్రిగుడ/హుకుంపేట/గూడెంకొత్తవీధి/చింతపల్లి రూరల్/కొయ్యూరు: ఎడతెరిపి లేని కురిసిన వర్షంతో ఉపాధి పనులకు కూలీలు వెళ్లలేకపోయారు. చాపరాయి గెడ్డ, సంపంగి గెడ్డలు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల ప్రదాన రహదారులు జలమయమయ్యాయి. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కామయ్యపేట రహదారి బురదమయంగా మారడంతో ఆ ప్రాంతం వైపు వెల్లే వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇప్పుడు పడిన వర్షంతో రైతులు తొలకరి దుక్కులు దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఎండలు గట్టిగా కాస్తాయని ప్రజలు భయపడుతున్న సమయంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

వై.రామవరం: మండలంలో భారీ ఎత్తున గాలివాన కురిసింది. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు పడడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సరఫరా మెరుగుపడకపోవడంతో మండల ప్రజలు అంధకారంలో మగ్గారు. వై.రామవరం వారపుసంత వెలవెలబోయింది.

2 నెలల్లో 5 వేల ఇళ్ల నిర్మాణాల లక్ష్యం





మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

- రూ.12.25 కోట్ల బిల్లులు లబ్ధిదారులకు జమ
- జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్ష

సాక్షి, పాడేరు: జిల్లాలో వచ్చే నెలాఖరులోగా ఐదు వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన మినీ సమావేశ మందిరంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని గృహ నిర్మాణశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. జిల్లాలో వివిధ దశల్లో నిర్మించిన వారికి రూ.12.25 కోట్ల బిల్లులను గత వారం జమ చేసిందన్నారు. మరో రూ.35 కోట్లు పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు లక్ష్యాలు నిర్దేశించి గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 17,149 ఇళ్లు మంజూరయ్యాయని, 15,105 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని వివరించారు. వెలుగు అధికారులు, మండల మహిళా సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించాలని, బ్యాంకు అధికారులతో మాట్లాడి స్వయం సహాయక సంఘాల నుంచి అదనంగా రూ.35 వేల రుణాలు పంపిణీ చేసి, గృహ నిర్మాణాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ బి.బాబునాయక్, రంపచోడవరం ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ నరసింహారావు, అరకులోయ, ఎటపాక డీఈఈలు మోహన్‌రావు, మూర్తి, 22 మండలాల ఏఈఈలు పాల్గొన్నారు.

పోశమ్మ ఆలయాన్ని పరిశీలించిన
రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సోమవారం సందర్శించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి ఇక్కడ ముంపునకు గురవుతున్న ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురైన కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని పరిరక్షించిన విధంగా ఇక్కడ చుట్టూ బావి తరహా ప్రాకారం నిర్మించి అమ్మవారి మూలవిరాట్టును రక్షించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించిన నమూనాలను పరిశీలించి నిర్మాణాలపై కూలంకుషంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఆలయ పరిరక్షణకు చేపట్టాల్సిన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈఈ పాండురంగారావు, ఎస్‌ఈ నరసింహమూర్తి, డీఈలు, ఏఈలు, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాల వెల్లువ

- పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- 58 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

తుమ్మపాల: పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లిని అభివృద్ధి చేస్తున్నామని, చదువుకున్న యువతకు జిల్లాలోనే ఉపాధి, ఉద్యోగాలు రానున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, కళాశాల నుంచి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన 58 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో 192 స్కిల్ హబ్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో త్వరలో కోడూరు, నక్కపల్లిలో పారిశ్రామిక పార్కులు పనులు ప్రారంభం అవుతాయన్నారు. అచ్చుతాపురంలో గ్రీన్ హైడ్రోజన్ పార్క్, నక్కపల్లి ప్రాంతంలో పెట్రో కెమికల్ పరిశ్రమలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో భూమిపూజ చేసే అదాని కంపెనీలో 25 వేల ఐటీ ఉద్యోగాలు లభించనున్నట్టు తెలిపారు. రూ.17 వేల కోట్లతో ఐటీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు జరుగుతుందన్నారు.

జోరువానలోనూ తగ్గేదేలే..

- హుషారుగా గ్రామ వలంటీర్ల పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 57.63 శాతం నమోదు
- 88.29 శాతంతో కూనవరం మొదటిస్థానం



పాడేరు మండలం గొండెలి గ్రామంలో వృద్ధుడికి వర్షంలోను పింఛన్ సొమ్ము అందిస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నానిపాత్రుడు



హుకుంపేట మండలం గూడ పంచాయతీలో వర్షంలోనూ లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న గ్రామ వలంటీర్ కొండబాబు

సాక్షి, పాడేరు: వానొచ్చినా.. వరదొచ్చినా.. వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము పంపిణీకి తగ్గేదే లే.. అంటున్నారు గ్రామ వలంటీర్లు.. వృత్తి పట్ల తమకున్న నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన జోరువానలోనూ పింఛన్ల సొమ్ము పంపిణీని హుషారుగా చేపట్టారు. ఈ ప్రక్రియను అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పర్యవేక్షించారు. గ్రామాల్లోని సామాజిక పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము ప్రతికూల వాతావరణంలోను ఉదయాన్నే అందడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లంతా గొడుగులను ఆశ్రయించి ఇంటింటా తిరిగారు. జిల్లాలో తొలిరోజు 57.63 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. లక్షా 23 వేల 820 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. ఆయా పింఛన్ల సొమ్మును ముందస్తుగానే గ్రామ వలంటీర్లకు అందజేశారు. ఉదయాన్నే తమ నిర్దేశిత కుటుంబాలకు ఇంటింటా తిరిగిన వలంటీర్లు పింఛన్ల సొమ్మును పంపిణీని చేపట్టారు. సోమవారం రాత్రికి 71 వేల 356 మందికి పింఛన్ల పంపిణీని పూర్తి చేశామని డీఆర్‌డీఏ పీడీ మురళీ సాక్షికి తెలిపారు. కూనవరం మండలంలో అత్యధికంగా 88.29 శాతం, ఏటపాకలో 83.93 శాతం, మిగిలిన మండలాల్లో 40 నుంచి 73 శాతం నమోదైంది. రెండు రోజుల్లో నూరుశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసే లక్ష్యంతో వలంటీర్లు ఉన్నారు.

మన్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- పాడేరు ఏఎస్పీగా ధీరజ్
- రంపచోడవరం ఏఎస్పీగా జగదీష్
- చింతూరు ఏఎస్పీగా రాహుల్‌మీనా



పాడేరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ధీరజ్



రంపచోడవరం ఏఎస్పీగా బాధ్యత స్వీకరిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి



చింతూరు ఏఎస్పీగా రాహుల్‌మీనా బాధ్యతలు

సాక్షి, పాడేరు: స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. 2020 ఐపీఎస్ బ్యాచ్, ఏపీ క్యాడర్‌కు చెందిన ధీరజ్‌కు విశాఖపట్నంలోని గ్రేహౌండ్స్ విభాగంలో తొలిపోస్టింగ్ వచ్చింది. ప్రభుత్వం ఇటీవల బదిలీల్లో భాగంగా పాడేరు ఏఎస్పీగా నియమించింది. విశాఖపట్నానికి చెందిన ఆయన సోమవారం పాడేరు చేరుకుని ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మతల్లిని సతీసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడుల ఆదేశాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి దుశ్శాలువా కప్పి, అమ్మవారి చిత్రపటం బహూకరించారు. అనంతరం తన కార్యాలయంలో ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన కార్యాలయ ద్వారం నిత్యం తెరిచే ఉంటుందని, ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు నేరుగా తనను కలవొచ్చన్నారు. పాడేరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో అన్ని పరిస్థితులపై అధ్యాయనం చేస్తానని, పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. మావోయిస్టుల కార్యకలపాలు, సంఘవిద్రోహక చర్యలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానన్నారు. మావోయిస్టులు, సానుభూతిపరుల సంచారంపై సమాచారం ఉంటే తమ స్టేషన్ల అధికారులతో పాటు, తనకు నేరుగా తెలియజేయాలని సూచించారు.

సీఐలు, ఎస్‌ఐల శుభాకాంక్షలు...

నూతన ఏఎస్పీ ధీరజ్‌ను సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. జి.మాడుగుల, పాడేరు, అరకులోయ సీఐలు సత్యనారాయణ, సుధాకర్, రుద్రశేఖర్, పాడేరు ఎస్‌ఐలు లక్ష్మణరావు, రంజిత్‌కుమార్ తదితరులు ఏఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనులతో మమేకం: రంపచోడవరం ఏఎస్పీగా జగదీష్

రంపచోడవరం: స్థానిక ఏఎస్పీగా జగదీష్ అడహళ్లి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అసాల్ట్ కమాండర్‌గా పనిచేసి తొలి పోస్టింగ్‌గా ఇక్కడ ఏఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంపై అవగాహన పెంచుకుని పాలనపై పట్టుసాధిస్తానన్నారు. గిరిజనులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఎప్పుడైనా తనను కలవచ్చన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గిరిజనులకు పోలీసులు మరింతగా దగ్గరయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన్ను సీఐ సురేష్‌బాబు, ఎస్సై మోహన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు.

చింతూరు ఏఎస్పీగా రాహుల్‌మీనా బాధ్యతల స్వీకరణ

చింతూరు: స్థానిక ఏఎస్పీగా రాహుల్‌మీనా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా 2019 బ్యాచ్‌కు చెందిన ఆయన్ను ఇక్కడ ఏఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన మహేశ్వరరెడ్డి రంపచోడవరం ఓఎస్డీగా బదిలీ అయ్యారు.

సిగనాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వకాలపై ఆరా

- ఇటీవల అక్రమంగా రంగురాళ్లు తవ్వినట్టు ప్రచారం

గూడెంకొత్తవీధి: పోలీసులు ఎంత నిఘా పెట్టినా రంగురాళ్ల అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఖాకీల కంటే అక్రమార్కులు తెలివిమీరుతున్నారు. ఇటీవల చింతపల్లి ముత్యాలమ్మ జాతరలో పోలీసు యంత్రాంగం భద్రత ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇదే అదనుగా భావించిన కొంతమంది మండలంలోని సిగనాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వినట్టు ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంపై ఒక వైపు పోలీసులు, మరోవైపు అటవీశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ రంగురాళ్ల క్వారీని మండలంలోని పెదవలస అటవీ రేంజిలో విలీనం చేశారు. ఈ క్వారీలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు తరచూ జరుగుతున్నాయి. ఇక్కడ ఎత్తయిన కొండపై రంగురాళ్ల కోసం పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు ప్రయత్నిస్తున్నారు. నర్సీపట్నం, చింతపల్లికి చెందిన పలువురు వ్యాపారులు వీరిని ప్రోత్సహిస్తున్నారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలు చేస్తుండగా, మట్టిపెళ్లలు విరిగిపడి ముగ్గురు గిరిజనులు మరణించారు. అప్పట్లో ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం పలువురిపై కేసులు నమోదు చేసింది. ఆ తర్వాత పోలీసు నిఘా పెట్టి తవ్వకాలను నియంత్రించింది.

జాతరను అదనుగా చేసుకుని...

ఇటీవల చింతపల్లిలో ముత్యాలమ్మ జాతరలో పోలీసు యంత్రాంగం భద్రత ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు సిగనాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వకాలకు ప్రోత్సహించినట్టు తెలిసింది. నర్సీపట్నానికి చెందిన వ్యాపారులతోపాటు చింతపల్లికి చెందిన కొంతమంది తవ్వకాల్లో లభించిన రంగురాళ్లను కొనుగోలు చేసినట్టు ప్రచారం. ఈ వ్యవహారంలో భారీగా ఆర్థిక లావాదేవీలు నడిచినట్టు తెలుస్తోంది. దీనిపై సమాచారం అందటంతో రంగంలోకి దిగిన పోలీసులకు రంగురాళ్ల తవ్వకాలపై ఆరా తీస్తున్నారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులతోపాటు ఈ వ్యాపారం చేసే వారిని పిలిపించి విచారిస్తున్నారు.

రంగురాళ్ల తవ్వకాలపై కఠిన చర్యలు

దీనిపై గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా, రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామన్నారు. తవ్వకాలకు సంబంధించి వస్తున్న ప్రచారంపై ఆరా తీస్తున్నామన్నారు. సిగనాపల్లి కొండ రక్షిత అటవీ ప్రాంతం కావడంతో ఆ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వారిని క్వారీ ప్రదేశంలో కాపలాగా ఉంచాలని డీఎఫ్‌వోను కోరామన్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి ఊరేగింపు



పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు

అరకులోయ రూరల్: వేంకటేశ్వర స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం మొదటి రోజు స్వామివారి ఉత్సవమూర్తులను స్థానిక ఆలయం నుంచి ప్రధాన రహదారి గిరిజన మ్యూజియం మీదుగా చేపల మార్కెట్ వరకు గోవింద నామస్మరణలతో ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగానే నర్సింగ్ దంపతుల నివాసం వద్ద వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య భక్తులు, పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలరాం, కమిటీ సభ్యులు చందుపాడి, అర్జున్, గుప్తా, నర్సింగరావు, రామరావు, తిరుపతి, హరి, కృష్ణారావు, రాజు, గులభి, జయ పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన కేసులో అరెస్టులు

జ్యుడీషియల్ రిమాండ్‌కు భార్య, ప్రియుడు, ఆమె తండ్రి, మరో ముగ్గురు



భార్య ప్రీతి



ప్రియుడు ప్రణయ్



లలిన్‌కుమార్



రాము



రాజు

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో సంచలనం రేపిన భర్తను హతమార్చిన భార్య కేసులో నిందితురాలితోపాటు, ఆమె కన్నతండ్రి, ప్రియుడు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు అందించారు. చోడవరంలోని మారుతీనగర్‌కు చెందిన హతుడు ఉద్రాక్ష హరి విజయ్ భార్య ప్రీతి, తమ ఇంటి వెనుక ఉండే బలయాది సింహసాయి ప్రణయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధంపై తరచూ గొడవలు జరిగేవి. దీనిపై భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడన్న కోపంతో భర్తను చంపాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు ఏప్రిల్ నెల 17 రాత్రి ఆమె తండ్రి సామిరెడ్డి శంకరరావు, ప్రియుడు ప్రణయ్ కుమార్, ప్రీతి స్నేహితుడు లావేటి లలిన్‌కుమార్(చొడపల్లి, అచ్యుతాపురం), కర్రి రాము(అచ్యుతాపురం), పిట్లకొండ రాజు అలియాస్ బషీర్(అనకాపల్లి), అనకాపల్లి సాయి కలిసి హతుడిని బాగా మద్యం సేవించేలా చేశారు. ఆ మత్తులో నిద్రపోతున్న హరివిజయ్‌ను తలగడతో అదిమి హతమార్చారు. చనిపోయాడని నిర్ధారణకు వచ్చాక రాత్రి 2 గంటల సమయంలో ప్రీతి తన కారులో మృతదేహాన్ని ఎక్కించుకుని, భర్త స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్ మండలం తీసుకువెళ్తూ, మార్గం మధ్యలో తన భర్తకు గుండె పోటు వచ్చిందని పాడేరు ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు అతడు చనిపోయినట్టు నిర్ధారించారు. మృతుడి బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో, పాడేరు పోలీసులు అనుమానాస్పద మృతిగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ప్రీతి తండ్రి సామిరెడ్డి శంకరరావు పాడేరు పోలీసులకు లొంగిపోయి వాస్తవాలను వెల్లడించడంతో హత్య కేసుగా మార్చి, చోడవరం స్టేషన్‌కు కేసును బదిలీ చేసినట్టు సీఐ వెల్లడించారు. దీంతో కేసులో భాగస్వాములైన భార్య ప్రీతి, ఆమె ప్రియుడు ప్రణయ్, వారికి సహకరించిన లలిన్‌కుమార్, రాము, రాజులను ఆదివారం అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులను సోమవారం జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రేపటిలోగా మ్యుటేషన్లు పూర్తి చేయండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని మండలాల్లో భూముల మ్యుటేషన్ల ప్రక్రియ ఈ నెల 3వ తేదీలోగా పూర్తి చేయాలని, ఆపై పెండింగ్ ఉంటే ఉపేక్షించేది లేదని కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయం నుంచి 22 మండల రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా భూముల రీసర్వే, మ్యుటేషన్లు, పీవీటీజీ ఓటర్ల నమోదు, ఫారం -6 సేకరణ, డీ ఫారం భూముల నివేదికల అప్‌లోడ్ వంటి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యుటేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రీసర్వే లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. వెక్టరైజేషన్ ఏ మేరకు పూర్తి చేశారో వీఆర్వోలు, సర్వేయర్లతో తహసీల్దార్లు సమీక్షించాలన్నారు. వీఆర్వోలు భూముల రీ సర్వే డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోల పనితీరు మెరుగుపడాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీతోపాటు సబ్ కలెక్టర్లు రోజూ తహసీల్దార్లతో సమావేశమవ్వాలని సూచించారు. అసైన్‌మెంట్ భూముల సేకరణ నివేదికలను స్థానిక ఎమ్మెల్యేలకు అందజేసి సమగ్రంగా వివరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, డీఆర్వో పి.అంబేడ్కర్, సర్వే విభాగం సహాయ సంచాలకుడు వై.మోహన్‌రావు, సర్వే ఇన్‌స్పెక్టరు ఎస్.నాగేశ్వరరావు, 22 మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు

సాక్షి, పాడేరు: పట్టణంలోని సుంద్రుపుట్టులో కొలువుదీరిన వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. మోదకొండమ్మతల్లి ఆలయం తరపున పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు సమర్పించారు. వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

భరతమాత ఉత్సవాలు

స్థానిక సుంద్రుపుట్టులోని భరతమాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, పాడేరు జిల్లా ఆస్పత్రి గైనిక్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు భరతమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పూలమాలలతో భరతమాతను ఆలంకరించారు. తొలుత ఎమ్మెల్యే దంపతులకు గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

నిలిచిన పాపికొండల పర్యాటకం

దేవీపట్నం: గోదావరిలో బోటుపై ప్రయాణించే పాపికొండల విహారయాత్రను మూడు రోజుల పాటు నిలిపివేశారు. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు పోశమ్మగండి నుంచి పేరంటపల్లి వెళ్లే పర్యాటక బోట్లను నిలుపుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ భాస్కర్ తెలిపారు. వాతావరణ పరిస్థితులను అనుసరించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి యాత్ర అనుమతికి ప్రకటిస్తామన్నారు.

ఘనంగా మేడే వేడుకలు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

సాక్షి, పాడేరు: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను సీపీఐ, ఏఐటీయూసీలు సోమవారం ఘనంగా నిర్వహించాయి. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పోటిక సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జీసీసీతో పాటు పలు కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద మేడేను ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘం నేతలు, కార్మికులంతా డప్పు వాయిద్యాలతో పాడేరులో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల హక్కులు, చట్టాల పరిరక్షణకు వారంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ, నాయకులు సింహాద్రి, సింహాచలం, చంటిబాబు, లక్ష్మణ్, లక్ష్మణరావు, సంతోష్, వెంకటరావు, నాయుడు పాల్గొన్నారు.

వెలవెలబోయిన ఐటీడీఏ స్పందన

- భారీ వర్షంతో రాలేకపోయిన అర్జీదారులు



పీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామ సర్వేయర్లు

రంపచోడవరం: ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం వెలవెలబోయింది. ఇక్కడ ఈ వారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడుగురు అర్జీదారులు మాత్రమే వచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీటిని పీవో సూరజ్ గనోరే స్వీకరించారు. గంగవరం మండలం ఎండపల్లి రామవరం నుంచి జడేరు, గంగవరం, చిన్న అడ్డపల్లి వరకు బీటీరోడ్లు నిర్మించాలని సర్పంచ్ బందారు రామలక్ష్మి కోరారు. అడ్డతీగల మండలం బొడ్లంక గ్రామంలోని భూ సమస్య పరిష్కరించాలని సిన తోజి సోమరాజు విన్నవించాడు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలో బోర్లు మరమ్మతులు చేసినందుకు రూ.37 వేలు మంజూరు చేయాలని చదల భరత్ కుమార్ దరఖాస్తు సమర్పించాడు. రంపచోడవరం డివిజన్లోని గ్రామ సచివాలయాల సర్వేయర్లకు పని ఒత్తిడి తగ్గించాలని, అధికారుల నుంచి ఇబ్బందులు పరిష్కరించాలని పి.లీలాకృష్ణ, తురక దేవరత్నం, కారం జగదీశ్ దొర తదితరులు విన్నవించారు. ఫీల్డ్ వర్క్ చేసేటప్పుడు తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐ, వీఆర్వోలు హాజరు కావడం లేదని గ్రామ సర్వేయర్లు ఫిర్యాదు చేశారు. ఎటువంటి సూచనలు, రికార్డులు అందజేయడం లేదని వాపోయారు. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ పనిచేయాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని, దీంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని క్యాడర్ల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని యూటీఎఫ్ నాయకులు పీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. వై రామవరం అప్పర్‌పార్ట్ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు మారేడుమిల్లిలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షం జగన్ ప్రభుత్వం

పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



గాంధీ గ్రామంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పేదలకు అండగా ఉండటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని గాంధీగ్రామంలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్లు తీసుకోవడానికి పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి, ఎండావానల్లో నిలబడి, వృద్ధులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తెచ్చి ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్ దారుల ఇంటికే వెళ్లి, పింఛన్ డబ్బులు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, స్కూల్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్ పాల్గొన్నారు.

మహిళ హత్యపై వేగవంతంగా దర్యాప్తు




దారకొండలో విచారణ చేపడుతున్న పోలీసులు

సీలేరు: సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి దారకొండలో పట్టపగలు మహిళను దారుణంగా నరికి హత్య చేసిన సంఘటనకు సంబంధించి జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ పలు కోణాలలో వేగవంతంగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమక్షంలో చింతపల్లిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అలాగే మహిళను హత్య చేసిన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. భూ తగాదాలు లేదా మరో కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న విషయంపై స్థానికులను విచారిస్తున్నారు.

సవాళ్లను స్వీకరిస్తేనే.. ఉన్నత స్థాయికి..

- మీ ఆశలు, ఆకాంక్షల సాధాలకు పునాదులు తల్లిదండ్రులే..
- ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు 1597 ఉద్యోగాలు
- నియామక పత్రాలు అందించిన వీసీ ప్రసాద రెడ్డి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : సవాళ్లను స్వీకరించిన వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షల సాధాలకు పునాదులు తల్లిదండ్రులేనని.. వారి అభ్యున్నతి కోసం తల్లిదండ్రులు చేసిన త్యాగాలను, కష్టాన్ని మరువరాదన్నారు. సోమవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎచీవర్స్ డేని ఘనంగా నిర్వహించారు. 1597 ఉద్యోగాలు సాధించిన 1001 విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు సన్మానం చేసి, పాదాలకు నమస్కరించి, ఆశీస్సులు తీసుకునే విధంగా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను వీసీ స్వయంగా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి మనం అందించే నిజమైన ఆస్తి విద్య అని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇదే వేదికపై నుంచి చెప్పిన మాటలు మరువలేమన్నారు. వర్సిటీలో చదివిన ప్రతీ విద్యార్థి ఉద్యోగం పొందడంతోపాటు మరో పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు. విశ్వవిద్యాలయంలో మైదానాలను తీర్చిదిద్దిన విధానం, వర్సిటీ స్వయం సంవృద్ధి సాధించే దిశగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను వివరించారు. ఈ బ్యాచ్ విద్యార్థులు కోవిడ్ పరిస్థితులను, ఆన్‌లైన్ బోధన, ఆఫ్‌లైన్ పరీక్షలు వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నేడు విజయవంతంగా వెళుతున్నారని, వీరికి సహకారం అందించిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థి దశ నుంచి ఉద్యోగిగా మారే ప్రయాణంలో ఎన్నో సవాళ్లు వస్తాయని.. వాటిని స్వీకరించడం, సాధించి చూపడం అలవాటు చేసుకోవాలన్నారు. నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ విలువల వ్యవస్థకు వారసులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులు వినయ సంపన్నులుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో తొలిసారిగా ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ తొలి ఉద్యోగం జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ విభాగం డైరెక్టర్ జి.వి.ఆర్ మూర్తి, విభాగాధిపతులు, ఆచార్యులు, పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాలుగు సంస్థల్లో ఉద్యోగాలు



సాఫ్ట్‌వేర్, కోర్ సంస్థల్లో నాలుగు ఉద్యోగాలు ఏకకాలంలో లభించాయి. కరికులంలో సాఫ్ట్‌వేర్ కోర్సులను భాగం చేయడంతో ఉద్యోగాల సాధన సులభమైంది. కళాశాలలో వాతావరణం, ప్లేస్‌మెంట్ కార్యాలయం ప్రత్యేక చొరవతో ఈ సంవత్సరం మంచి ఆఫర్స్ లభించాయి.

–ఎస్.కిరణ్మయి, ఈసీఈ విభాగం

అంతా సంతోషంగా ఉన్నాం..



కెమికల్ ఇంజనీరింగ్‌లో అవకాశాలు తక్కువగా ఉన్నాయి. కోర్ కంపెనీల్లో ఉద్యోగం రావడం చాలా కష్టమైన అంశం. ప్లేస్‌మెంట్ అధికారులు, ఏయూ వీసీ ప్రత్యేక చొరవ తీసుకుని పెద్దసంఖ్యలో సంస్థలను ఆహ్వానించారు. మంచి వేతనంలో ఉద్యోగం రావడంతో అందరం సంతోషంగా ఉన్నాం.

–ఎం.కీర్తన, కెమికల్ ఇంజనీరింగ్, ఆఈట్ విద్యార్థిని

కోర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది



జేఎస్‌డబ్ల్యూ సంస్థలో ఉద్యోగం సాధించాను. కాలేజీలో ముందుగానే ప్లేస్‌మెంట్స్‌పై కొంత అవగాహన కల్పించారు. దీంతో ఇంటర్వ్యూ సులభంగా చేశాను. కోర్ కంపెనీలో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది.

–ఎస్.మౌనిక, మెకానికల్ విభాగం

ఇంటర్న్‌షిప్‌లు ఉపయుక్తంగా నిలిచాయి



మొదటి సంవత్సరం నుంచి సిలబస్ ఎంతో దూరదృష్టితో తీర్చిదిద్దారు. ఉద్యోగానికి అవసరమైన సాఫ్ట్‌వేర్, లైబ్రరీలో డిజిటల్ సదుపాయాలు.. మాకు కోడింగ్‌పై ఆసక్తిని పెంచాయి. అదే విధంగా కోర్సులో భాగంగా అందించిన ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి.

–ఆర్.ఈశ్వరీ ప్రియ, సీఎస్ఈ విభాగం

10లోగా మీడియా అక్రిడిటేషన్లకు దరఖాస్తులు

సాక్షి,పాడేరు: వివిధ ప్రసార మాధ్యమాల్లో పని చేస్తున్న జర్నలిస్టులు మీడియా అక్రిడిటేషన్ల కోసం ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

2023, 24 సంవత్సరాల కాల పరిమితికి పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరుకు సోమవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించామన్నారు. సమాచారశాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://www.ipr.gov.in లో వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ప్రింట్ తీసి దానితోపాటు అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు ఆయా మండలాలకు సంబంధించిన ప్రెస్ క్లిప్పింగులు జత చేసి పాడేరు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

కార్మికుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి



కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

యలమంచిలి: కార్మిక చట్టాల పట్ల కార్మికులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణంలో కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆటో, ట్యాక్సీ యూనియన్, వివిధ కార్మిక సంఘాల సమావేశంలో కార్మిక చట్టాల పట్ల అవగాహన కల్పించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాల వర్తింపులో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే కోర్టు సముదాయం పరిధిలో పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. కార్మికుల పిల్లలు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఎక్కువగా అట్టడుగు, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కార్మికుల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు తను చేసే వృత్తి పట్ల అంకిత భావంతో ఉంటే, సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ద్వారపురెడ్డి వెంకటరావు, రామకృష్ణరావు, కోర్టు సిబ్బంది నిర్మల, ఏఐటీయూసీ కార్యదర్శి ఏసుదాసు, ఆటో, ట్యాక్సీ యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- బైక్‌ను ఢీకొని పరారైన గుర్తు తెలియని వాహనం



నూతలగుంటపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

కశింకోట: మండలంలోని నూతల గుంటపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాలు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బుల్లెట్‌ను అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని, పరార్ అయింది. దీంతో బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న వారిలో తీడ గ్రామానికి చెందిన అడిగర్ల పెద గంగరాజు(31) తలకు బలమైన గాయం తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గోగాడ వినోద్, లాలం గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉన్న గంగాధర్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వినోద్ అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మరణించిన గంగరాజు మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గంగరాజు పరవాడ ఫార్మాసిటీలోని ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. అడిగర్ల అచ్చిబాబు, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు. ఇంకా పెళ్లి కాలేదు. చేదోడుగా ఉన్న కుమారుడు అందని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.